ఎదురు చూపులు!

- మిల్లుల దగ్గర బారులు తీరిన ధాన్యం ట్రాక్టర్లు
- రోజుల తరబడి వేచి చూస్తున్న రైతులు
- భయపెట్టిస్తున్న అకాల వర్షాలు



మరికల్‌లో మిల్లు దగ్గర బారులు తీరిన ధాన్యం ట్రాక్టర్లు

మరికల్: జిల్లా వ్యాప్తంగా వరికోతలు ఒకేసారి ప్రారంభం కావడంతో మిల్లుల దగర ధాన్యం ట్రాక్టర్లు బారులు తీరాయి. మరోపక్క ప్రైవేట్‌లో యాసంగి ధాన్యానికి మద్దతు ధర లేకపోవడంతో అధిక శాతం రైతులు ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలకు తరలించేందుకు మొగ్గు చూపుతున్నారు. దీంతో రైతులు ఆరబెట్టిన ధాన్యం ఒకేసారి మిల్లులకు తరలించడంతో ఒక్కొక్క మిల్లు దగ్గర కిలోమీటర్‌కు పైగా ధాన్యం లారీలు, ట్రాక్టర్లు బారులు తీరాయి. ధాన్యం లోడ్లు ఖాళీ చేయడం కోసం రెండు లేక మూడు రోజుల సమయం పడుతోంది. ఒక లారీ అన్‌లోడు చేయాలంటే రెండు గంటల సమయం పడుతోంది. మిల్లులో కూలీల కొరత ఉండటంతో రైతులు తమ ధాన్యం బస్తాలను మిల్లులో ఖాళీ చేయించేందుకు తంటాలు పడుతున్నారు.

అదనపు రవాణా ఖర్చులు

మరికల్ మండలంలోని 5 మిల్లులు ఉండగా మక్తల్, ధన్వాడ, నర్వ మండలాల నుంచి ధాన్యం లారీలు, ట్రాక్టర్లు భారీ ఎత్తున్న రావడంతో ఒక్కొక్క మిల్లు దగ్గర వందల సంఖ్యలో ట్రాక్టర్లు నిలిచాయి. వెనకల ఉన్న ధాన్యం ట్రాక్టర్ల వంతు రావడానికి 2 రోజులకు పైగా సమయం పడుతోంది. దీంతో ధాన్యం తరలించిన ట్రాక్టర్లకు అదనపు రవాణా భారం రైతులపై పడుతోంది. మిల్లుకు తెచ్చిన ధాన్యానికి మిల్లర్లు తేమశాతం ఎక్కువగా ఉందని, తాలు ఉందని కిలో నుంచి 2 కిలోల వరకు తరుగు తీస్తున్నారు.

భయపెట్టిస్తున్న అకాల వర్షాలు..

అష్టకష్టాలు పడి ఆరబెట్టిన ధాన్యాన్ని మిల్లులకు తరలించినా, అకాల వర్షాలు రైతులను భయ పెట్టిస్తున్నాయి. అకస్మాతుగా కురుస్తున్న వర్షాల కారణంగా ధాన్యం తడవకుండా అద్దె కవర్లు తెచ్చి ట్రాక్టర్లపై కప్పుతున్నారు. వర్షాలకు ధాన్యం తడిస్తే తేమశాతం పేరుతో తరుగు తీస్తారనే భయం రైతులను వెంటాడుతోంది. ఆదివారం జిల్లాలో అక్కడక్కడ కురిసిన అకాల వర్షాల వల్ల ధాన్యం తడవడంతో రైతులు పరిస్థితి ఆగమ్యగోచరంగా మారింది. మిల్లులకు తెచ్చిన ధాన్యం తడిస్తే తరుగు లేకుండా తీసుకోవాలని రైతులు అధికారులను కోరుతున్నారు.

రెండు రోజులవుతోంది..



ఆరబెట్టిన ధాన్యాన్ని ట్రాక్టర్‌లో లోడు చేసిన లైన్‌లో పెట్టి రెండు రోజులు అవుతోంది. లారీలు కూడా రావడంతో ధాన్యం అన్‌లోడు చేయడం కోసం గంటల సమయం పడుతోంది. దీంతో రాత్రింభవళ్లు ఇక్కడే ఉంటున్నాం. మా గోడు ఎవరికి చెప్పుకోవాలో అర్థం కావడం లేదు. తర్వగా ధాన్యం ఖాళీ చేయాలని మిల్లర్లను అడిగితే కూలీలు తక్కువగా ఉన్నారని, లైన్ వచ్చే వరకు ఆగాలని చెబుతున్నారు. చేసేది లేక రోజుల తరబడి ధాన్యం అమ్మడానికి జాగరణ చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది.

– రాజేందర్‌గౌడ్, రైతు, రాకొండ

ట్రాక్టర్లకు అదనపు రవాణా భారం పడుతోంది



ధాన్యం బస్తాలు త్వరగా దించుకోకపోవడంతో ట్రాక్టర్‌కు అదనపు రవాణా భారం పడుతోంది. మూడు రోజుల నుంచి ఇక్కడే ఉన్నాను. ధాన్యం అమ్మలాంటే ఇంత కష్టం ఎప్పుడు చూడలేదు. అకాల వర్షాలు రావడంతో మిల్లుకు తెచ్చిన ధాన్యం బస్తాలు తడుస్తున్నాయి. అధికారులు కూడా ఎవరూ మిల్లుల దగ్గరకు రావడం లేదు. తర్వగా ధాన్యం భస్తాలను దించేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలి.

– వెంకటేష్, రైతు, తీలేర్

అకాల వర్షం.. అపారనష్టం



వర్షంలో తడిసిన వరిధాన్యం



వర్షానికి ఆగిన నీరు

- కొట్టుకుపోయిన వరిధాన్యం
- వందల ఎకరాల వరిపంట నష్టం

మక్తల్: అకాల వర్షం కురవడం, గాలి తీవ్రంగా వీచడంతో పంటలు నష్టపోయిన సంఘటన ఆదివారం మక్తల్ మండలంలోని మాద్వార్, దాదాన్‌పల్లి, ఖానాపూర్, పంచలింగాల, కర్ని, రుద్రసముద్రం, కాట్రిమ్‌పల్లి, మక్తల్ గ్రామాల్లో చోటుచేసుకుంది. గాలి వాన వల్ల చెట్లు, విద్యుత్ స్తంభాలు, ఇంటి పైకప్పులు పడిపోయాయి. రుద్రసముద్రం, మాద్వార్, కర్నిలో పంటలు నేలమట్టమయ్యాయి. ఆదివారం 2 గంటల సమయంలో మక్తల్ శివారులో, మాద్వార్‌లో వర్షం కురవడంతో ఆరబోసిన వరిధాన్యం కొట్టుకుపోయింది. చేతికొచ్చే సమయంలో అకాలవర్షానికి పంటలు దెబ్బతిన్న రైతులు కన్నీరుమున్నీరయ్యారు.

తడిసిన ధాన్యం కొనాలి

మాగనూర్: ఉమ్మడి మండలంలో ఆదివారం కురిసిన అకాల వర్షానికి ధాన్యం తడిసి రైతులు దిక్కు తోచని పరిస్థితి ఉన్నారని, ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లో షరతులు లేకుండా ధాన్యం కొనుగోలు చేయాలని బీజేపీ ఉమ్మడి మండల అధ్యక్షుడు నల్లె నర్సప్ప డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో వారు మాట్లాడారు. కార్యక్రమంలో అమర్‌దీక్షిత్, కనకరాజు, నారాయణ, జయనంద్‌రెడ్డి, తిమ్మప్ప, అంజప్పగౌడ్, సోమప్పగౌడ్, కృష్ణయ్య, సిద్దపగౌడ్, కేశవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి

నారాయణపేట: జిల్లాలో కురిసిన భారీ వర్షం వడగళ్ళ వానతో నష్ట పోయిన పంటలకు నష్టపరిహారం చెల్లించి రైతులను ఆదుకోవాలని తెలంగాణ రైతు సంఘం జిల్లా కార్యదర్శి అంజిలయ్య గౌడ్ ఆదివారం ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని కోరారు. జిల్లాలో మక్తల్, మాగనూరు, కృష్ణ మండలాల్లో తలంకేరి, దొడ్డి, నేరేడుగాం, వర్కూర్, ఉప్పరి పల్లి తదితర గ్రామాల్లో అకాల వర్షానికి కల్లాల్లో ఆరబెట్టిన ధాన్యం నీట మునిగి అపార నష్టం కల్గిందన్నారు. అధికారులు క్షేత్ర స్థాయిలో పరిశీలన చేసి రైతులను ఆదుకోవాలన్నారు. మక్తల్ మండలం ఉప్పరి పల్లిలో రైతు పొలం దగ్గర పిడుగు పాటుకు గురై ఎద్దు చనిపోయిందని రైతు కుటుంబాన్ని ఆదుకోవాలన్నారు. తడిసిన ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేయలని డిమాండ్ చేశారు.

క్లుప్తంగా

ఇందిరమ్మ ఇళ్ల క్షేత్రస్థాయి పరిశీలన



కొత్తపల్లి: ఇందిరమ్మ ఇళ్ల పథకానికి అర్హులను ఎంపిక చేయాలని కలెక్టర్ సిక్తా పట్నాయక్ ఆదేశాల మేరకు ఆదివారం మండల పరిధిలోని భూనీడులో అధికారులు ఇందిరమ్మ దరఖాస్తులను క్షేత్ర స్థాయి పరిశీలన చేశారు. పలువురు లబ్ధిదారులు ఇంటి నిర్మాణంలో ప్రభుత్వం నిర్ణయించిన కొలతలకు అదనంగా నిర్మించుకుంటామని కోరగా ప్రభుత్వ నిబంధనల ప్రకారం 45నుంచి 65 గజాల స్థలంలో మాత్రమే నిర్మించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీఓ రమేశ్, పంచాయతీ కార్యదర్శి తిరుపతి, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఊట్కూర్ ఎస్ఐపై చర్యలు తీసుకోవాలి

మరికల్: బీఎస్పీ నాయకుడిని బెదిరించిన ఊట్కూర్ ఎస్ఐపై ఎస్పీ చర్యలు తీసుకోవాలని బీఎస్పీ జిల్లా అధ్యక్షులు బొదిగెలి శ్రీనివాస్ డిమాండ్ చేశారు. మరికల్‌లో ఆయన విలేకర్లతో మాట్లాడుతూ నాలుగు రోజుల క్రితం ఓ కేసు విషయంలో బాధితుడికి న్యాయం చేయాలని కోరిన తమ పార్టీకి చెందిన నాయకుడిని, అధికార పార్టీ నాయకులతో కుమ్మక్కై భయపెట్టించిన ఎస్ఐ తీరు సరైంది కాదన్నారు. అధికార పార్టీకి చెందిన నాయకులకు తొత్తుగా ఉన్నారని ప్రశ్నించారు. ఈ విషయంపై ఎస్పీ చొరవ తీసుకొని ఆయనపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

భూసారం బుగ్గి చేయొద్దు



మాగనూర్: వరి పొలంలో గడ్డికి నిప్పంటిస్తే ఆ భూమిలో ఒక సెంటిమీటర్ లోతు వరకు భూమిపై పొరలో మట్టి 33.8 నుంచి 42.2 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రతకు గురువుతుంది. అత్యంత కీలకమైన సూక్ష్మ జీవరాసులు, శిలింద్రాల సంతతి నశించిపోతుందని, భూమి సేంద్రియ లక్షణం నాశనమవుతుంది. భూమి పై పొరలోని మేలు చేసే మిత్ర పురుగులు నశించడంతో పంటలపై పురుగులు దాడి పెరిగిపోతుంది. టన్నుల పంట వ్యర్థం తగులబెట్టినప్పుడు మట్టిలోని సేంద్రియ కర్బనంతో పాటు (5.5 కిలోల నత్రజని, 2.3 కిలోలకు పైగా ఫాస్పరస్ ,25 కిలోల పోటాషియం, కిలోకు పైగా గంధకం వంటి) 33.8 పోషకాలు నశనమవుతాయి. భూసారం ఎవరు కూడా బుగ్గి చేయొద్దని వ్యవసాయ అధికారులు సూచిస్తున్నారు.

విద్యుదాఘాతంతో ఆవుదూడ మృత్యువాత



మరికల్: విద్యుదాఘాతంతో ఆవుదూడ మృతి చెందిన సంఘటన ఆదివారం చోటుచేసుకుంది. బాధితుల వివరాల ప్రకారం.. మండలంలోని పెద్దచింతకుంటకు చెందిన ఆంజనేయులు తన వ్యవసాయ పొలం దగ్గర పశువులను మేతకోసం వదిలాడు. ట్రాన్స్‌ఫార్మర్ దగర పచ్చిమేత కన్పించడంతో ఆవుదూడ మేతకోసం వెళ్లింది. అకస్మాత్తుగా ట్రాన్స్‌ఫార్మర్‌కు తగలడంతో విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృత్యువాత పడింది. లైన్‌మేన్ బాల్‌రాజ్ ఘటనా స్థలానికి వెళ్లి పంచనామా చేసి, ఈ విషయాన్ని ఏఈ దృష్టికి తీసుకెళ్లాడు.

తాగునీటి ఎద్దడి



ధన్వాడ: మండల కేంద్రంలో రెండు రోజులుగా తాగు నీటి ఎద్దడితో గ్రామస్తులు అల్లాడుతున్నారు. మిషన్ భగీరథ నీరు రాకపోవడంతో పలు కాలనీలో తాగునీటి ఎద్దడి ఏర్పడింది పైపు లీకేజీ కారణంగా తాగునీటిని నిలిపేశారు. ముందస్తు సమాచారం లేకుండా అధికారులు నీటి సరఫరా నిలిపేయడంతో గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేశారు. పంచాయతీ అధికారులు ఉదయం వాటర్ ట్యాంకరు ద్వారా నీటి సరఫరా చేశారు. ఉప్పు నీరు కావడంతో వాడుకునేందుకు నీటిని నింపుకున్నా తాగునీటికి మాత్రం ప్రజలు ఇబ్బంది పడుతున్నారు.

మన్ కీ బాత్ వీక్షించిన నాయకులు



మన్ కీ బాత్ కార్యక్రమాన్ని వీక్షిస్తున్న నాగురావు నామాజీ, తదితరులు

నారాయణపేట రూరల్: దేశ ప్రధాని నరేంద్ర మోదీ నిర్వహించిన మన్ కీ బాత్ 121 కార్యక్రమం జిల్లా వ్యాప్తంగా బీజేపీ నాయకులు వీక్షించారు. ఈ సందర్భంగా రాష్ట్ర నాయకులు నాగురావు నామాజీ, జిల్లా అధ్యక్షులు కొండా సత్యయాదవ్ మాట్లాడారు. కార్యక్రమంలో రఘువీర్ యాదవ్, జ్యోతి సాయిబన్న, వినోద్, శ్రీనివాస్ రెడ్డి, రఘురామయ్య గౌడ్, శేఖర్, ప్రభంజన్, రామనారాయణ, సూర్యకాంత్ పాల్గొన్నారు.

ధన్వాడ: ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ నిర్వహించిన మాన్‌కి బాత్ కార్యక్రమాన్ని ఆదివారం బీజేపీ ఆధ్వర్యంలో టీవీలో తిలకించారు. మండల అధ్యక్షులు శివరాజ్, మాజీ అధ్యక్షులు సురేందర్, విజయ్, విరేష్, సదానందం, పాలువురు మాన్‌కి బాత్‌ను లైవ్‌ను తిలకించారు.

బాధిత కుటుంబాన్ని పరామర్శించిన ఎమ్మెల్యే



పులిమామిడిలో బాధిత కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి

ఊట్కూరు: మండలంలోని పులిమామిడి గ్రామంలో రెండు రోజుల క్రితం కే రాఘవేందర్‌గౌడ్ అనారోగ్యంతో మృతి చెందాడు. ఈ విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి ఆదివారం బాధిత కుటుంబాన్ని పరామర్శించారు.

బసవ జయంతి ఘనంగా నిర్వహిద్దాం

నారాయణపేట రూరల్: మహత్మా బసవేశ్వరుడి జయంతి 30న ఘనంగా నిర్వహిద్దామని వీరశైవ లింగాయత్ లింగ బలిజ సంఘం జిల్లా అధ్యక్షులు అవుటి రవికుమార్ అన్నారు. స్థానిక శివలింగేశ్వర దేవస్థానంలో ఆ సంఘం జిల్లా కమిటీ, పట్టణ పెద్దల సమక్షంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అందరి అభిప్రాయాలు తీసుకుని ప్రణాళిక సిద్ధం చేశారు. మే 10న వీరశైవ ప్రతిభా పురస్కార కార్యక్రమాన్ని ఏర్పాటు చేయాలని నిర్వహించారు. ఈ విద్యా సంవత్సరం టెన్త్, ఇంటర్ పరీక్షలలో ఏ, మార్కులు సాధించిన లింగాయత్ విద్యార్థులను అభినందించాలని నిర్ణయించారు. సమావేశంలో గందె రవికాంత్, మల్లికార్జున్, నాగభూషణం, శంక్రప్ప, డాక్టర్ సచిన్, అర్కంచి రవి, హుల్సూర్ రఘుబాబు, శివకుమార్, విశ్వనాథ్, గందె సుమిత్, రాజేష్, సురేష్, అనిల్ పాల్గొన్నారు.

నేడు అభివృద్ధి పనులకు భూమి పూజ

కోస్గి రూరల్: మండలంలోని గ్రామాలలో పలు అభివృద్ధి పనులకు భూమి పూజ కొడంగల్ నియోజకవర్గ ఇన్‌చార్జి తిరుపతిరెడ్డి, కడా చైర్మన్ వెంకట్ రెడ్డితో కలిసి చేపట్టనున్నారని ఆదివారం కాంగ్రెస్ మండల అధ్యక్షుడు రఘువర్ధన్‌రెడ్డి అన్నారు. మండల కార్యకర్తలు హాజరు కావాలని కోరారు.

ఆలయాల్లో ఆధ్యాత్మిక శోభ



బురుజుగడ్డ ఆంజనేయ స్వామికి పూజలు నిర్వహిస్తున్న భక్తులు

నర్వ: అమావాస్య సందర్భంగా మండలంలోని ఆయా గ్రామాల ఆలయాల్లో ఆధ్యాత్మిక శోభ సంతరించుకుంది. ఈ సందర్భంగా నర్వ, పెద్దకడ్మూర్, లంకాల్, రాంపూర్, ఉందేకోడ్, రాయికోడ్, బెక్కర్ పల్లి, కల్వాల్, గ్రామాల్లోని ఆలయాల్లో అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. పెద్దకడ్మూర్, నర్వ బాలబ్రహ్మేశ్వరస్వామి ఆలయంలో స్వామి వారికి పంచామృతాభిషేకం, బిల్వార్చన, పల్లకీ సేవ, మహామంగళహారతి, భక్తులకు తీర్థప్రసాదాల వితరణతో పాటు అన్నదానం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో పెద్ద ఎత్తున భక్తులు పాల్గొన్నారు.

మెట్టుగడ్డ ఆంజనేయ స్వామికి ప్రత్యేక పూజలు

దామరగిద్ద: నారాయణపేట మండల సరిహద్దులోని మెట్టుగడ్డ ఆంజనేయ స్వామి ఆలయంలో అమావాస్య సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. భీష్మరాజ్ ఫౌండేషన్ చైర్మన్ రాజ్‌కుమార్‌రెడ్డి ఆలయంలో స్వామి వారిని దర్శించుకున్నారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.



పెద్దకడ్మూర్‌లో బాలబ్రహ్మేశ్వరస్వామి ఆలయంలో భక్తులకు అన్నదానం

దేవాలయంలో ప్రత్యేక పూజలు

ధన్వాడ: మండల కేంద్రంలోని బురుజుగడ్డ ఆంజనేయస్వామి దేవాలయంలో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు.అనంతరం ప్రసాదం పంపిణీ చేశారు. ఇందులో ముదిరాజ్ సంఘం జిల్లా ఉపా ధ్యక్షులు నర్సింహులు నాయుడు, రవికుమార్, రాఘవేందర్, నారాయణ, తదితరులు పాల్గొన్నారు.

జాబ్ మేళాను సద్వినియోగం చేసుకోండి

దామరగిద్ద: నిరుద్యోగ యువతీ యువకులు ఉద్యోగ అవకాశాలను కల్పించేందుకు భీష్మరాజ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 3 న జిల్లా కేంద్రంలోని ఎస్ఆర్ గార్డెన్‌లో ఏర్పాటు చేయనున్న జాబ్ మేళాను యువత సద్వినియోగం చేసుకోవాలని భీష్మరాజ్ ఫౌండేషన్ చైర్మన్ రాజ్‌కుమార్‌రెడ్డి అన్నారు. మండలంలోని కాన్‌కుర్తి ఆంజనేయ స్వామి ఆలయ ఆవరణలో జాబ్‌మేళా కరపత్రాలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో జ్ఞానేశ్వర్, బస్వరాజ్, భీమప్ప, శరణ్, లక్ష్మణ్, నవీన్, కాశప్ప, సంతోష్, ఫౌండేషన్ సభ్యులు పాల్గొన్నారు.



కాన్‌కుర్తిలో కరపత్రాలు విడుదల చేస్తున్న రాజ్‌కుమార్‌రెడ్డి

ప్రపంచ శాంతి కోసం పాటుపడాలి



కొత్తపల్లి: జమ్ము కశ్మీర్ పహల్గాం పర్యాటకులపై ఉగ్రవాదులు జరిపిన దాడుల్లో అమరులైన వారికి సంఘీభావంగా శనివారం రాత్రి కొత్తపల్లి మండలంలోని నిడ్జింత గ్రామంలో హిందూ ముస్లింలు కొవ్వొత్తులతో నివాళులు అర్పించారు. కార్యక్రమంలో గ్రామ యువకులు శ్రీనివాస్ రెడ్డి, విజయ్ కుమార్, రవి గౌడ్, రఫి, బాబర్, అక్లాక్, ముస్తఫా, నందు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థినికి ఘన సన్మానం

నారాయణపేట ఎడ్యుకేషన్: ఇటీవల విడుదలైనా ఇంటర్‌మీడియట్ ప్రథమ సంవత్సర ఫలితాలలో నారాయణపేట జిల్లా దామరగిద్ద మండలానికి చెందిన కన్కప్ప–విజయ దంపతుల కుమార్తె అక్షయ ఎమ్‌పీసీ విభాగంలో 470 మార్కులకు గానూ 469 మార్కులు సాధించి రాష్ట్ర స్థాయిలో ప్రథమ స్థానంలో నిలిచింది. ఈ విషయం తెలుసుకున్న భీష్మరాజ్ ఫౌండేషన్ చైర్మెన్ డాక్టర్ కె.రాజ్‌కుమార్ రెడ్డి ఆదివారం విద్యార్థినిని శాలువాతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఫౌండేషన్ సభ్యులు గడ్డం తిప్పన్న, పోలీస్ పటేల్ మధుసూదన్ రెడ్డి, గోపాల్ గౌడ్, హనుమంతు పాల్గొన్నారు.

నేడు కోటకొండకు మంత్రాలయం పీఠాధిపతి రాక



నారాయణపేట రూరల్: మండలంలోని కోటకొండ నరసాచల శ్రీభూ శ్రీనివాస స్వామి విగ్రహ ప్రతిష్ఠాపన జరిగి 50 ఏళ్ల పూర్తి కావస్తున్న సందర్భంగా ఆలయంలో స్వర్ణోత్సవ వేడుకలను నిర్వహిస్తున్నారు. సోమవారం నుంచి 7 రోజుల పాటు జరిగే ఈ వేడుకలకు ఆంధ్రప్రదేశ్ రాష్ట మంత్రాలయం పుణ్యక్షేత్ర పీఠాధిపతి సుబుదేంద్రతీర్థులు హాజరవుతున్నారు. మే 4వరకు జరిగే ఈ వేడుకలకు ఆలయ నిర్వాహకులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామి కృపకు పాత్రులు కావాలని సేవా సమితి సభ్యులు సీతారామారావు, జనార్దన్‌రావు కోరారు.

మైసమ్మ ఆలయానికి పోటెత్తిన భక్తజనం

నవాబుపేట: మండలంలోని పర్వతాపూర్ మైసమ్మ ఆలయానికి భక్తులు పోటెత్తారు. ఆదివారం అమావాస్య కావడంతో వివిధ ప్రాంతాల నుంచి భక్తులు కుటుంబ సమేతంగా తరలివచ్చి.. అమ్మవారిని దర్శించుకున్నారు. భక్తిశ్రద్ధలతో మైసమ్మ దేవతకు పూజలు చేశారు. అనంతరం నైవేద్యం సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. భక్తులతో ఆలయ ప్రాంగణం కిటకిటలాడింది. అమ్మవారి నామస్మరణతో మైసమ్మ అడవి మార్మోగింది. దుకాణాలు కొనుగోలుదారులతో సందడిగా కనిపించాయి. ఆలయ పూజారులు అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి పూజా కార్యక్రమాలు నిర్వహించారు.

వరంగల్‌కు తరలిన బీఆర్ఎస్ శ్రేణులు



గుడిగండ్ల గ్రామంలో జెండాను ఆవిష్కరిస్తున్న మాజీ ఎమ్మెల్యే చిట్టెం రాంమోహన్‌రెడ్డి



మద్దూరులో పార్టీ జెండావిష్కరణ చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

- బీఆర్ఎస్ జెండాలు ఆవిష్కరించిన మాజీ ఎమ్మెల్యేలు
- సభకు వివిధ రకాల వాహనాల్లో..

సాక్షి, నెట్‌వర్క్: బీఆర్ఎస్ పార్టీ స్థాపించి 25 ఏళ్ల పూర్తి చేసుకున్న సందర్భంగా రజతోత్సవ సభకు జిల్లాలోని ఆయా గ్రామాలు, మండల కేంద్రాలు, పట్టణాల నుంచి భారీ సంఖ్యలో వివిధ రకాల వాహనాల్లో బీఆర్ఎస్ కార్యకర్తలు, అభిమానులు ఆదివారం తరలి వెళ్లారు.

- మరికల్ మండల కేంద్రంలో పార్టీ జెండాను మాజీ ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డి ఆవిష్కరించారు. అనంతరం పార్టీ నాయకులతో కలిసి వరంగల్‌కు భారీ సంఖ్యలో తరలివెళ్లారు.
- మక్తల్ మండలం గుడిగండ్ల గ్రామంలో బీఆర్ఎస్ పార్టీ జెండాను మక్తల్ మాజీ ఎమ్మెల్యే చిట్టెం రాంమోహన్‌రెడ్డి ఎగర వేశారు. పట్టణంలో పలు వార్డుల్లో కౌన్సిలర్లు పట్టణాధ్యక్షులు జెండా ఆవిష్కరణ చేశారు.
- మాగనూర్ మండలం వర్కూర్‌లో బీఆర్ఎస్ జెండాను మండల అధ్యక్షుడు ఎల్లారెడ్డి ఆవిష్కరించారు.
- మద్దూరు మండలంలోని గ్రామాల్లో పార్టీ జెండా విష్కరణ చేశారు. పట్టణంలో పట్టణాధ్యక్షుడు మహేందర్ జెండావిష్కరణ చేశారు. వరంగల్ సభకు సలీం, గోపాల్, వీరారెడ్డి శివకుమార్, బసప్ప, బాల్‌చందర్‌గౌడ్, పీర్‌అహ్మద్, నర్సింహ, విఠల్, తదితరులు వెళ్లారు.
- కొత్తపల్లి మండలం నుంచి కొడంగల్ మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్ రెడ్డి పిలుపు మేరకు ప్రత్యేక వాహనాల్లో వరంగల్ మహాసభకు తరలి వెళ్లారు.
- కోస్గి మండలంలో జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ రామకృష్ణ, వెంకట్‌నర్సింహులు, సాయిలు, రాజశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో తరలివెళ్లారు.
- నర్వ మండల కేంద్రంలో బీఆర్ఎస్ పార్టీ జెండాను మండల అధ్యక్షులు మహేశ్వర్‌రెడ్డి ఎగురవేశారు. అనంతరం ప్రత్యేక వాహనాలను జెండా ఊపి ప్రారంభించారు. నాయకులు పీఏసీఎస్ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి, వైస్ చైర్మన్ లక్ష్మన్న, నాయకులు పాల్గొన్నారు.
- ఊట్కూరు మండలం అంబేడ్కర్ చౌరస్తాలో బీఆర్ఎస్ పార్టీ జెండావిష్కరణ చేశారు. బిజ్వార్, అమీన్‌పూర్, ఓబులాపూర్, ఊట్కూరు గ్రామాల నుంచి బహిరంగసభకు తరలి వెళ్లారు.
- నారాయణపేట మండల అధ్యక్షుడు, మాజీ ఎంపీటీసీ వేపూర్ రాములు కోటకొండలో జండా ఊపి వాహన శ్రేణిని ప్రారంభించారు. మండలంలోని తిరుమలాపూర్, బండగొండ, అవంగాపూర్, కొల్లంపల్లి, జాజాపూర్, షేర్నపల్లి, సింగారం, భైరంకొండ, అప్పిరెడ్డిపల్లి గ్రామాలలో గులాబీ జెండా ఎగరవేసిన అనంతరం ఆర్టీసీ బస్సులు, ప్రత్యేక వాహనాల్లో తరలి వెళ్లారు.
- దామరగిద్ద మండలంలోని అన్ని గ్రామాల్లో జెండాలను ఆవిష్కరించారు.



కోటకొండలో వాహన శ్రేణి ప్రారంభిస్తున్న వేపూరి రాములు